క్లుప్తంగా

పుష్కర కుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానం



ఆత్మకూరు: పట్టణంలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో ఆగస్టులో మూడు రోజుల పాటు నిర్వహించే పుష్కర కుంభాభిషేక మహోత్సవానికి రావాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. గురువారం వారు చేజర్ల మండలం పెరుమాళ్లపాడులోని ఫామ్ హౌస్‌లో మంత్రిని కలిసి ఆహ్వానపత్రికలను అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు యానాదిరెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, కుడుముల సుధాకర్, ఎస్ సంతోష్, చంద్రారెడ్డి, పీ సుధాకర్‌రెడ్డి, పీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలకు నగదు విరాళం



ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లిలోని పీర్లచావిడి వద్ద మొహర్రం వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల నిర్వహణకు బీఎస్సార్ ఫౌండేషన్ నిర్వాహకుడు బొమ్మిరెడ్డి తారకనాథ్‌రెడ్డి రూ.15వేలు నగదు విరాళాన్ని తన ట్రస్టు సభ్యుల ద్వారా మొహర్రం కమిటీ సభ్యులకు అందజేశారు.

ఏపీటీఎఫ్ భవన నిర్మాణానికి విరాళం



వింజమూరు(ఉదయగిరి): అమరావతిలో కొత్తగా నిర్మిస్తున్న ఏపీటీఎఫ్ భవన కోసం శంఖవరం పాఠశాల హెచ్‌ఎం చల్లా వెంకటేశ్వరరెడ్డి రూ.10వేలు విరాళాన్ని ప్రకటించారు. అందుకు సంబంధించిన చెక్కును యూనియన్ నేతలకు గురువారం అందజేశారు. అనంతరం ఏపీటీఎఫ్ నాయకులు మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు పీ మల్లికార్జున, జెడ్ మోహన్‌రెడ్డి, పీ కొండారెడ్డి, మదార్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా ప్రదీప్



కొండాపురం : మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా ప్రదీప్, ఉపాధ్యక్షుడిగా పృథ్వీరాజ్, జనరల్ సెక్రటరీగా టీ గోపాల్, కోశాధికారిగా సీహెచ్ వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎం సురేష్‌బాబు గురువారం తెలిపారు. గోవిందమ్మపల్లి ఫీడర్ పరిధిలో విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. వ్యవసాయ రంగానికి ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాను అందించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

6న పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు

ఉదయగిరి రూరల్: ఈ నెల 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గండిపాళెం పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్ర శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత నెల 26 నుంచి చేపడుతున్న నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలో 51 వేల జీవాలకు నట్టల నివారణ మందును తాపించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 25 వేల జీవాలకు అందజేశామని తెలిపారు. అలాగే ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

వైభవంగా పదహారు రోజుల పండగ



క్యూలైన్‌లో భక్తుల రద్దీ



నర్రవాడకు ఊరేగింపుగా వస్తున్న పొట్టేళ్ల ప్రభ

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయంలో పదహారు రోజుల పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ముగిసి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా వెంగమాంబ గర్భగుడిని పూలతో విశేషంగా అలంకరించారు. వెంగమాంబ, గురవయ్య దంపతుల మూలవిరాట్టులతో పాటు ఉత్సవమూర్తులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. వెంగమాంబ దంపతులు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. నర్రవాడ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పొట్టేళ్ల ప్రభలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేశారు. అలాగే సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, లారీలను ప్రత్యేకంగా అలంకరించుకుని నర్రవాడకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో క్యూలైన్‌లు కిక్కిరిశాయి. కావలి, లక్ష్మీపురం, తదితర ప్రాంతాలకు చెందిన భజన బృందాలు కోలాట ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ భజన బృందాలను అభినందించారు.



వెంగమాంబ సన్నిధిలో పొంగళ్లు పెడుతున్న భక్తులు



హోమగుండంలో ఎండు కొబ్బరి వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



మహిళల కోలాట ప్రదర్శన

ముగిసిన కలిగిరమ్మ తిరునాళ్ల



విశేషాలంకరణలో కలిగిరమ్మ



కలిగిరమ్మకు నైవేద్యాలను సమర్పిస్తున్న భక్తులు

కలిగిరి: కలిగిరిలో జరుగుతున్న గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్ల గురువారంతో ముగిసింది. చివరిరోజు కలిగిరమ్మను పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. కలిగిరి, పాపనముసిలిపాళెం, జిర్రావారిపాళెం గ్రామాల భక్తులు ఆలయం చుట్టూ బండ్లు తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయం వద్ద సూడిమానును తిప్పి ఉత్సవాలను ముగించారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



కృష్ణారెడ్డిపల్లెలో ఆందోళన చేస్తున్న రైతులు

ఉదయగిరి రూరల్: రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై యూరియాను సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కృష్ణారెడ్డిపల్లెలోని బస్టాండ్ సెంటర్‌లో రైతులతో కలిసి గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల అవసరాల మేరకు ప్రభుత్వం యూరియాను సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. యూరియాకు డిమాండ్ నెలకొనడంతో ఎరువుల డీలర్లు కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తేనే ఇస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు రాయితీపై యూరియా సరఫరాను చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులు చిన్నపరెడ్డి, చెంచురామిరెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పీర్లచావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు



అల్లూరులో లంగరు కార్యక్రమం

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని తూర్పుమహమ్మదీయపాళెంలోని ఇమామ్ ఖాసీం పీర్ల చావడి వద్ద గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొహర్రం నెల ఏడోరోజు సందర్భంగా ముజావర్లు కరిముల్లా, జాకీర్ ఆధ్వర్యంలో లంగరు కార్యక్రమాన్ని నిర్వహించారు. గతేడాది కోరుకున్న కోరికలు నెరవేరిన వారు గుర్రం మీద ఊరేగింపుగా పీర్ల చావిడి వద్దకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించారు. కాగా 8వ రోజు సోమవారం మసీద్ సెంటర్‌లోని మౌలాలి దర్గా వద్ద మౌలాలీ సేరా గ్రామోత్సం నిర్వహించనున్నారు. 9వ రోజు రాష్ట్రంలోనే ఎంతో ప్రత్యేకత కలిగిన మోపూరు పీర్‌ను ఊరేగింపుగా అల్లూరుకు చేర్చనున్నారు.

సోమశిల: సోమశిలలోని పీర్ల చావిడి వద్ద గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

డీసీపల్లిలో 733 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 733 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 926 బేళ్లు రాగా, 733 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.160, సగటున రూ.211.58 ధర పలికిందని వివరించారు. వేలంలో తొమ్మిది కంపెనీలకు చెందిన వ్యాపారప్రతినిధులు పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్ రేపు

కావలి (జలదంకి): కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో ఈ నెల 5న జాతీయ మెగాలోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. కక్షిదారులు రాజీపడి వస్తే లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కరించిన కేసులను పైకోర్టుల్లో అప్పీలు చేసేందుకు వీల్లేదన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోకుండా కొండాపురం, జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు మండలాలకు చెందిన కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



కలిగిరి: డెంగీ మాసోత్సవాల్లో భాగంగా కలిగిరిలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలతో డెంగీ వ్యాప్తి చెందుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు దోమలు కుట్టకుండా దోమతెరలను వాడడం ద్వారా డెంగీ నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. కావలి సబ్‌యూనిట్ మలేరియా అధికారి లక్ష్మీనరసయ్య, సీహెచ్‌ఓ సాయిలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



కావలి (జలదంకి): కావలి పట్టణంలోని బుడంగుంట గిరిజన కాలనీలోని పేదలకు సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కర్నాటి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు కర్నాటి రోహిత్, నాగభార్గవి దంపతులు గురువారం అన్నదానం చేశారు. తన తల్లి అనూరాధ వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు రోహిత్ తెలిపారు.

విద్యార్థినులు పరిశుభ్రతను పాటించాలి



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు అస్మా

ఆత్మకూరు: వసతిగృహ విద్యార్థినులు పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఆత్మకూరు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు అస్మా సూచించారు. పట్టణంలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థినులకు గురువారం ఆమె వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం వసతిగృహంలోని వంటశాలను పరిశీలించి ఆహార పదార్థాలను రుచిచూశారు. విద్యార్థినులు చిన్నపాటి అనారోగ్యానికి గురైనా వెంటనే యూపీహెచ్‌సీకి తీసుకురావాలని సూపర్‌వైజర్లకు సూచించారు. ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు విద్యార్థినులకు అందుబాటులో ఉంటారని అనారోగ్య సమస్యలు ఎదురైతే మందులు పొందవచ్చని తెలిపారు. ఎంపీహెచ్‌ఈఓ సుధాకర్, ఎంపీహెచ్ఎస్ పార్వత మ్మ, జీ రవీంద్రరెడ్డి, ఏఎన్ఎం సుభానీబేగం, ఆశలు, విజయలక్ష్మి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



దగదర్తి మండల నాయకులతో సమావేశమైన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి): కావలిలోని తన నివాసంలోని క్యాంపు కార్యాలయంలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దగదర్తి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. దగదర్తి మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో దగదర్తి ఎంపీటీసీ తాళ్లూరు సరస్వతమ్మ కుమారుడు తాళ్లూరు శేఖర్‌నాయుడు, వెలిపోడు ఎంపీటీసీ మద్దెల రాణి భర్త మద్దెల దయాకర్, దామవరం ఎంపీటీసీ వట్టికాళ్ల తిరుపతియాదవ్ సోదరుడి కుమారుడు వట్టికాళ్ల మాధవ, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి పరామర్శ



కొండయ్య పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలిలోని 31వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దాల కొండయ్య గురువారం మృతి చెందారు. జనతాపేటలోని నివాసంలో ఉంచిన కొండయ్య పార్థీవ దేహాన్ని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం రాఘవేంద్రనగర్‌లో జరిగిన 13వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తుమ్మల రామిరెడ్డి తల్లి నారాయణమ్మ ఉత్తరక్రియలకు హాజరయ్యారు. తుమ్మల నారాయణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్‌నాయకులు కర్తం శ్రీనివాసులరెడ్డి ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగ్రామమైన కొండాపురం మండలం రేణమాలలో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన నివాసానికి వెళ్లి రామిరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే కాకర్లకు సమస్యలు ఏకరువు



తల్లికి వందనం రాలేదని మొరపెట్టుకున్న వెంగమ్మ

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ బీసీ కాలనీలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం పర్యటించారు. సుపరిపాలనకు ముందడుగు -ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యేకు ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. బీసీ కాలనీకి చెందిన కొమరగిరి వెంగమ్మ తనకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని..అందరూ పాఠశాలలకు వెళుతున్నారని..అయినా ఒక్కరికి కూడా తల్లికి వందనం అందలేదని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. తనకు సెంటు భూమి లేకపోయినా పదెకరాలు ఉన్నట్లుగా రికార్డుల్లో నమోదు చేసి ఉండడంతో సంక్షేమ పథకాలు అందడం లేదని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే వెల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్వోను పిలిచి ఇలాంటి సమస్యలను తాను వచ్చేవరకు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే మరికొందరు మహిళలు తమకు రేషన్‌కార్డు లేదని, ఆధార్ సేవల కోసం ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బీసీ కాలనీలో తాము దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇప్పటికీ తాము ఉంటున్న నివేశన స్థలాలు అటవీ శాఖకు చెందినవిగా రికార్డుల్లో నమోదై ఉన్నాయని, సమస్యను పరిష్కరించాలని పలువురు కోరారు.

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన



సోమశిల: అనంతసాగరం మండలం గౌరవరం, బొమ్మవరం గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ గురువారం పరిశీలించారు. గ్రీన్‌అంబాసిడర్ల తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించి వర్మికంపోస్టు తయారు చేసి పంచాయతీల ఆదాయ వనరులను పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బొమ్మవరం సచివాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి, ఈఓపీఆర్డీ రామచంద్రయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేజర్ల చెరువు ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల చెరువును రూ.1.25కోట్లతో ఆధునీకరించనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన చేజర్ల చెరువు ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.తొలుత బస్టాండ్ సెంటర్‌లోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అనంతరం చేజర్ల పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో రూ.22.59 కోట్లతో 369 సీసీరోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆర్డీఓ బీ పావని, డీఎంఅండ్‌హెచ్‌ఓ సుజాత, తహసీల్దార్ బీ మురళి, పీహెచ్‌సీ డాక్టర్ మెహతాబ్, నాయకులు తాళ్లూరి గిరినాయుడు, షేక్ సిరాజ్, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవచౌదరి, లక్ష్మీనరసారెడ్డి, బీ వీరరాఘవరెడ్డి, వావిలేరు సర్పంచ్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మద్యంమత్తులో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి సోమశిల నుంచి అనంతసాగరానికి ద్విచక్ర వాహనంపై వస్తూ చెత్త డంపింగ్ యార్డ్ సమీపంలోని క్రషర్ వద్ద అదుపుతప్పి పడిపోయి గాయపడ్డాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

రేషన్ కష్టాలు

- వృద్ధులు, దివ్యాంగులకు డోర్‌డెలివరీ చేయాలన్న ప్రభుత్వం
- చౌకదుకాణాల వద్దకే రావాలంటున్న డీలర్లు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

చౌకదుకాణం వద్దకు రమ్మన్నారు



ఈ ఫొటోలో మంచం మీద ఉన్న వృద్ధుడి పేరు హజరత్తయ్య. వయస్సు 74. ఈయన భార్యతో కలిసి ఆత్మకూరులోని టెక్కే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. గతంలో ఎండీయూ ఆపరేటర్ ఇంటి వద్దకు వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు. గత నెలలో వాహనాలను తొలగించి చౌకదుకాణం వద్ద ఇవ్వగా భార్యను పంపించి సహాయకుల ద్వారా సరుకులు తెప్పించుకున్నారు. జూలైకు సంబంధించి వృద్ధులకు ముందస్తుగా రేషన్ సరుకులను డోర్‌డెలివరీ చేస్తామని ప్రభుత్వం చెప్పినా డీలర్ ఇవ్వలేదు. చౌకదుకాణం వద్దకు రావాలని చెప్పడంతో తన భార్యను పంపించి తెప్పించుకున్నానని హజరత్తయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

ఆత్మకూరు: వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ కష్టాలు తప్పడం లేదు. వారికి రేషన్ డోర్‌డెలివరీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినా డీలర్లు పాటించడం లేదు. లబ్ధిదారులకు స్వయంగా ఫోన్ చేసి 'మేం డోర్‌డెలివరీ చేయలేం.. మీరే చౌకదుకాణాల వద్దకు వచ్చి సరుకులు తీసుకెళ్లండి' అని చెబుతున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులు చౌకదుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని గమనించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ డోర్‌డెలివరీని ప్రారంభించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడం గత నెల నుంచి రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. రేషన్ లబ్ధిదారులు చౌకదుకాణాల వద్ద క్యూ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. దివ్యాంగులు, వృద్ధులు చౌకదుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. దీంతో కూటమి ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవడంతో జూలై నెలకు సంబంధించి వృద్ధులు, దివ్యాంగులకు జూన్ 26వ తేదీ నుంచే డోర్‌డెలివరీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు డీలర్లకు సైతం ఆదేశాలు జారీ చేసింది. అయితే కొందరు డీలర్లు దివ్యాంగులు, వృద్ధుల ఇళ్ల వద్దకు వెళ్లి వేలిముద్రలు తీసుకుని సరుకులు అందజేయగా, మరికొందరు డీలర్లు లబ్ధిదారుల బంధువులను రేషన్ దుకాణం వద్దకు పిలిపించుకుని వారి వేలిముద్రలు తీసుకుని సరుకులు అందజేశారు. దీంతో రేషన్ లబ్ధిదారులు సరుకులు తీసుకోకపోతే కార్డులు రద్దయిపోతాయనే భయంతో ఆటోలో అష్టకష్టాలు పడుతూ వెళ్లి సరుకులు తెచ్చుకోగా, మరికొందరు బంధువుల సాయంతో సరుకులు తెచ్చుకున్నారు. మరికొందరు ఇప్పటి వరకు సరుకులు తెచ్చుకోకుండా ఎదురు చూస్తున్నారు. ఆత్మకూరులోని ఒక్కో చౌకదుకాణం పరిధిలో సుమారు 500 నుంచి 700 వరకు రేషన్‌కార్డులు ఉన్నాయి. అందులో 30 నుంచి 40 వరకు దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలతో మంచానికే పరిమితమైన లబ్ధిదారులు ఉన్నారు. పట్టణంలోని 13, 21, 15 చౌకదుకాణాల పరిధిలో వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరుకులు డోర్‌డోలివరీ చేయని పరిస్థితి కనిపించింది. సీఎస్‌డీటీ ప్రత్యేక యాప్ ద్వారా డోర్‌డెలివరీని పర్యవేక్షిస్తున్నా క్షేత్రస్థాయిలో వృద్ధులు,దివ్యాంగులకు రేషన్ సరుకులను డీలర్లు డెలివరీ చేయడం లేదు. ఈ విషయమై తహసీల్దార్ బీ పద్మజాకుమారిని సంప్రదించగా రేషన్ దుకాణాల వారీగా పరిశీలించి వృద్ధులు, దివ్యాంగులకు సరుకులు డోర్‌డెలివరీ చేస్తే ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

డోర్‌డెలివరీ చేయలేదు



ఈ ఫొటోలో మంచానికి పరిమితమై ఉన్న దివ్యాంగురాలి పేరు షాహీనా. ఈమెకు అంత్యోదయ కార్డు ఉంది. 30 కేజీల బియ్యం వస్తాయి. ఆమెకు గతంలో ఎండీయూ ఆపరేటర్ ఇంటి వద్దకు వచ్చి రేషన్ అందజేసేవారు. ఎండీయూ వాహనాలను తొలగించడంతో కష్టాలు మొదలయ్యాయని వృద్ధులైన తల్లిదండ్రులు వాపోయారు. డీలర్లు డోర్‌డెలివరీ చేస్తారని అధికారులు చెప్పినా ఇప్పటి వరకు సరుకులు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలించి డోర్‌డెలివరీ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.